దర్జాగా కాలువ కబ్జా..!

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతను టీడీపీ శ్రేణులు బాగా ఒంటబట్టించుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమణలకు తెరలేపారు. ప్రభుత్వ స్థలాలతో పాటు మురుగు కాలవలనూ వదలకుండా యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు. ఫలితంగా నందికొట్కూరులోని ప్రభుత్వ స్థలాలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయి.

- ప్రభుత్వ స్థలాలు, మురుగు కాలువలనూ వదలని టీడీపీ నాయకులు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలు



ఆక్రమణకు గురైన కాలువ

నందికొట్కూరు: స్థానిక మున్సిపాలిటీలో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. పట్టణంలోని ప్రధాన కాల్వ నలభై ఏళ్ల క్రితం వరకు దాదాపు 200 అడుగుల వెడల్పు ఉన్న మురుగు కాలువ తెలుగు తమ్ముళ్ల ఆక్రమణలతో ప్రస్తుతం పది అడుగులకు చేరింది. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా మురుగు నీరు రోడ్లపై పారుతోంది. కాలువతోపాటు పట్టణంలోని ప్రభుత్వ స్థలాలే లక్ష్యంగా అధికారపార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారు. నయానో, భయానో అధికారులకు నచ్చజెప్పి పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇటీవల మారుతీనగర్‌లోని స్థలాలను కబ్జాలు చేసి సెంటు రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారనే విమర్శలున్నాయి. జర్నలిస్ట్ కాలనీలో అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొందరు తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వ కాలువలను, స్థలాలను కాజేస్తున్నారు. వాగుకు చెందిన 10 ఎకరాలను ఆక్రమించుకున్ని దుకాణాలు, గృహాలు నిర్మించుకున్నారు. ఇక్కడ సెంటు రూ.20 లక్షలపైగా పలుకుతుందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారనే విమర్శలున్నాయి.

కాలువపై అక్రమ నిర్మాణాలు



కాలువను ఆక్రమించుకుని కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కాలువ చిన్నదైపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతుంది. దోమల బెడద ఎక్కువైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టాలి.

– ఉపేంద్రారెడ్డి, నందికొట్కూరు పట్టణం

ఆక్రమణలు తొలగించాలి



కాలువను ఆక్రమించి కట్టిన ఇళ్లు, దుకాణాలు తొలగించాలి. అలాగే మారుతీ నగర్‌లో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను కాపాడండి.

– వెంకటేశ్వరు, సీపీఐ(ఎంఎల్) నాయకులు

విచారణ చేపడతాం

ఆక్రమణకు గురైన కాలువ స్థలాలపై విచారణ చేపడతాం. కాలువ పోరంబోకు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే మారుతీ నగర్‌లో కబ్జాకు గురవుతున్న స్థలాలను స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేవారిపై చర్యలు తప్పవు.

– శ్రీనివాసులు, తహసీల్దార్, నందికొట్కూరు

క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగికి ఘన సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పగిడ్యాల: మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గుంపుల వెంకటేశ్వర్లును జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత సూచించారు. మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల పరిధిలోని మొక్కజొన్న పైర్లను మంగళవారం ఆమె పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ టెక్నికల్ అసిస్టెంట్ కలాం, ఏఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి



కళ్లకు గంతలు కట్టుకుని దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సమ్మె ఒప్పంద హామీలను అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు తిమ్మయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్ట్, మున్సిపాలిటీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్ చెల్లించాలని కోరారు. అంతకుముందు కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు రాజు, జయన్న, రాజేష్, సువర్ణమ్మ, సుశీలమ్మ, సుగుణమ్మ, జీవరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ అనూష

బండి ఆత్మకూరు: మండలంలోని పెద్దదేవలాపురం, ఈర్నపాడు గ్రామాల్లో మంగళవారం వెటర్నరీ డాక్టర్లు అనూష, జ్యోత్స్నదేవిల ఆధ్వర్యంలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమాన్ని వెలుగోడు సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దరగయ్య

వెలుగోడు: బోయరేవుల గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి భాషాపోగుల దరగయ్య జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షులు వాదం నాగేషులు మాదిగ, కో ఇన్‌చార్జ్‌లు ఆరోగ్యం మాదిగ, నవీన్ మాదిగ, వెంకటరమణ మాదిగ పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి



శానిటేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తే రోగాలు దరి చేరవని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం ఆమె చెత్తసేకరణ పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా నిల్వ ఉంచి చెత్తసేకరణ కేంద్రాలకు చేర్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారధి, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి ఉన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు

పాములపాడు: పంట పొలాల్లో మోతాదాకు మించి రసాయన ఎరువులు వాడరాదని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం జూటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు.

శిక్షణకు హాజరవ్వాలి

కొత్తపల్లి: ఎన్నికల జాబితా నిర్వహణపై బుధవారం నిర్వహించే ఒక్కరోజు శిక్షణకు బూత్ లెవెల్ అధికారులు(బీఎల్ఓలు) హాజరు కావాలని తహసీల్దార్ ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెదురు మునగ సాగుతో రైతులకు ఆదాయం

కొత్తపల్లి: వెదురు, మునగ పంటల సాగుతో రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని వెలుగు ఏపీఎం పుల్లయ్య, డీపీఎం సురేష్ సూచించారు. స్థానిక వెలుగు సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ చేపల పెంపకం వైపు కూడా రైతులు మొగ్గుచూపాలన్నారు. చేపల పెంపకానికి యూనిట్‌కు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని, 35 శాతం సబ్సిడీ ప్రభుత్వం నుంచి వస్తుందని చెప్పారు. అనంతరం గ్రూప్‌ల ఏర్పాటు, లోన్ రికవరీ తదితర అంశాలపై వివరించారు.

యువతను ఓటరుగా నమోదు చేయించండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రేమంతకుమార్

ఆత్మకూరు: అర్హులైన యువతీ, యువకులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని శ్రీశైలం నియోజకవర్గం ఎన్నికల అధికారి ప్రేమంతకుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటుహక్కు ఉందన్నారు. ఇదే విషయంపై అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ప్రస్తుతం అర్హుల పేర్లు చేర్చడం, అనర్హుల, మృతిచెందిన, వారి పేర్లు చేర్చే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమ పరిధిలోని బోగస్ ఓటర్లను గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే తొలగిస్తామన్నారు. సమావేశంలో రాజకీయపార్టీ ప్రతినిధులు సయ్యద్‌మీర్, వెంకటస్వామిగౌడ్, వేణుగోపాల్, అరుణ్‌కుమార్, శ్యామ్‌ప్రభాకర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: మండలంలో అర్హత కలిగిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్న మార్గదర్శకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన నిరుపేద కుటుంబాన్ని మ్యాప్ చేసుకుని వారు సమాజంలో గౌరవంగా జీవించేలా ఆర్థికంగా స్థిరపడేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ, మండల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలు నిలిపివేత



ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు: వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులపై జరిపిన తనిఖీల్లో 72 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపేశారు. మంగళవారం రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, అనంతపురం విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓంకారేశ్వర ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా రూ.12 లక్షల విలువైన ఎరువులను, దుర్గ భవాని ఫర్టిలైజర్స్ షాప్‌లో రూ.70 వేల విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. వారి వెంట వ్యవసాయ అధికారులు ఆర్ పవన్‌కుమార్, ప్రసాద్‌రావు ఉన్నారు.

- నందికొట్కూరు: చిత్తూరు జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఏఎంఈ ప్రసాద్, స్థానిక వ్యవసాయ అధికారి గిరీష్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాసులు మంగళవారం మండల కేంద్రలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా నకిలీ విత్తనాలకు నిలయంగా మారిన నందికొట్కూరు ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ దుకాణాల్లో తూతూ మంత్రంగా తనిఖీలు చేసినట్లు రైతులు చర్చించుకుంటున్నారు.
- జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలోని పావని, జూపాడుబంగ్లాలోని శ్రీబాలాజీ పురుగు మందుల దుకాణాలను రాష్ట్ర విజిలెన్స్ ఏడీ ప్రసాద్, సీఐ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పావని ఫెస్టిసైడ్స్ దుకాణంలో అనుమానిత పురుగు మందు శాంపిల్ తీయించాలని ఏఓ కృష్ణారెడ్డికి సూచించారు. వీరి వెంట నందికొట్కూరు ఏడీ గిరీష్ ఉన్నారు.
- మహానంది: బుక్కాపురంలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో రాష్ట్ర విజిలెన్స్ ఏడీఏ నరసింహారెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట విజిలెన్స్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఓలు నాగేశ్వరరెడ్డి, ప్రసాదరావు ఉన్నారు.

కమనీయం.. మహానందీశ్వరుడి కల్యాణం



మహానందీశ్వర దంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీ దేవి సహిత మహానందీశుడి దంపతులకు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, అర్చకులు కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలను చేపట్టారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

- ఆషాడ మాసం సందర్భంగా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి ఎల్లయ్య, గంగిశెట్టి మల్లికార్జున, రమణయ్యలతో పాటు స్థానిక మహిళలు చీరసారె సమర్పించారు.

జూపాడుబంగ్లాకు చేరిన కేసీ నీరు

జూపాడుబంగ్లా: కేసీ కాల్వ కింద ఖరీఫ్ సీజన్‌కు గానూ సాగుచేసిన పంటలు ఎండిపోతుండగా ఆయకట్టుకు సాగునీరు అందకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మూడు రోజులుగా క్రమేణా నీటివిడుదలను పెంచుతూ మంగళవారం ఉదయం సుంకేసుల డ్యాం నుంచి 2వేల క్యూసెక్కులకు నీటిసరఫరాను పెంచటంతో సాయంత్రం సాగునీరు జూపాడుబంగ్లాకు చేరుకుంది. ఈరోజు సాయంత్రానికి పాములపాడు లాకిన్స్‌లాకు చేరుకునే అవకాశం ఉందని కేసీ కాల్వ అధికారులు పేర్కొంటున్నారు.

సంఘం ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేదిలేదు

నందికొట్కూరు: ఏపీఎన్‌జీఓ సంఘం ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తే సహించేది లేదని సంఘం నాయకులు రాముడు, సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఏపీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీఎన్‌జీఓ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. స్వార్థపరులు సంఘంలో ఉంటూ సంఘాన్ని అగౌరవపరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామం వద్ద కేసీ కెనాల్ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. బ్రిటీష్ కాలంలో వంతెన నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. వంతెన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కర్నూలు డీసీ చైర్మన్ బన్నూరు పరమేశ్వరరెడ్డి ఉన్నారు.

కుమారస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పీహెచ్‌సీ సిబ్బంది బదిలీ

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే రోజు ఏడుగురు సిబ్బంది బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆరేళ్లుగా ఇక్కడ పని చేస్తున్న ఎంపీహెచ్‌ఈవో ఎంసీ నరసింహులు, వైద్యాధికారిణి శ్రీదేవి, స్టాఫ్ నర్స్ నాగమ్మ, అనిత, ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందర్, ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ బదిలీపై వెళ్తుండటంతో మంగళవారం తోటి ఉద్యోగులు మెడికల్ ఆఫీసర్ జహీర్‌వలి ఘనంగా సత్కరించారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళావేదికపై మైదుకూరుకు చెందిన వై.నాగరాజు భాగవతార్ వారి శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం ఆకట్టుకుంది. తబల సహకారాన్ని సుధాకర్, హార్మోనియం సహకారాన్ని జయకృష్ణ అందించారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వెలుగోడు: అంతర్జాతీయ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించారు. చక్కని నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం షాహినాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సునీల్, రామకృష్ణ, మహమ్మద్ ఫైజుల్లా, జయశ్రీ, రమాదేవ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై సహకారం అందించాలి

నందికొట్కూరు: న్యాయవాదులు కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహనకు సహకారం అందించాలని ట్రైన్డ్ న్యాయవాది ఎం.వెంకటరమణ కోరారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కక్షిదారులకు మధ్యవర్తిత్వ అవగాహన కలిపించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఏజీపీ మహేశ్వరుడు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు రహిమాన్, హుసేన్, శోభారాణి పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు



ఉపాధిలో జరిగిన అవినీతిని సభ దృష్టికి తెస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం సక్రమంగా అందిస్తే కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దు చేసి డీలర్లకే పంపిణీ బాధ్యతలను అప్పగించడంతో వినియోగదారులకు సక్రమంగా రేషన్ అందడం లేదని కో ఆప్షన్ సభ్యులు అస్లాం బాషా సభ దృష్టికి తెచ్చారు. పడమర ప్రాతకోట ముస్లిం కాలనీవాసుల కోసం కేసీ కెనాల్ వద్ద వేసిన బోర్ నీరులో నుంచి కలుషిత నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఉపాధి హామీ పథకంలో అవినీతి జరుగుతోందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు, పాలు, సన్నబియ్యం పక్కదారి పడుతున్నాయని, గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయని, బస్సు సర్వీసులు సమయపాలన పాటించడం లేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. సభలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయ అధికారి మురళీధర్, వెటర్నరీ డాక్టర్లు విజయ్‌భాస్కర్, రాగ సంధ్య, సీడీపీఓ మంగవల్లి పాల్గొన్నారు.

పవర్‌హౌస్‌ను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్



విద్యుదుత్పాదన తీరును స్కాడాలో పరిశీలిస్తున్న డైరెక్టర్ సుజయకుమార్

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని మంగళవారం ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎం.సుజయకుమార్ సందర్శించారు. ఈ యేడాది వర్షాకాల సీజన్‌లో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తిని ఆయన స్వయంగా పరిశీలించారు. ఎంసీఆర్ ఆపరేటింగ్ సిస్టంలను తనిఖీ చేశారు. స్కాడా సిస్టం ఆపరేషన్‌ను పరిశీలించారు. కుడిగట్టు కేంద్రంలో ఉన్న ఏడు జనరేటర్ల పనితీరు, వాటికి ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. వార్షికంగా కుడిగట్టు కేంద్రంలో చేపట్టాల్సిన మరమ్మతులు, మెయింటనెన్స్ పనులు తదితరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుజయకుమార్ మాట్లాడుతూ శ్రీశైలం కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో మునుపెన్నడూ లేని విధంగా 20 మంది ఇంజినీర్లను పోస్టింగ్ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది కుడిగట్టు కేంద్రంలో 1,000 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి టార్గెట్ కాగా మంగళవారం వరకు 253.11 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. డైరెక్టర్ వెంట చీఫ్ ఇంజినీర్ జి.తిరుమల ప్రసాద్, ఎస్ఈ శ్రీనివాసులు, ఇంజినీర్లు ఉన్నారు.

మల్లన్న సేవలో మాజీ కేంద్ర ఎన్నికల అధికారి



మాజీ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి స్వామి చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మాజీ కేంద్ర ఎన్నికల అధికారి రాజీవ్‌కుమార్ అగర్వాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. ఆశీర్వచన మండపంలో ఆయనకు శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఉన్నారు.

సంక్షిప్తం

విధులకు సకాలంలో హాజరవ్వాలి

జూపాడుబంగ్లా: ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరవ్వాలని మండల విద్యాధికారి–1 చిన్న మద్దిలేటి సూచించారు. మంగళవారం ఆయన 80 బన్నూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

ఒకేషనల్ విద్యతో స్వయం ఉపాధి

నందికొట్కూరు: ఒకేషనల్ విద్యతో స్వయం ఉపాధి పొందవచ్చని ప్రభుత్వ వైద్యురాలు నీలిమ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవంపై విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీ పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

మహానంది: గాజులపల్లె గ్రామంలోని సచివాలయం–2 సమీపంలో నివసిస్తున్న మేకల వెంకటేశ్వర్లు, గుడెపోగుల వీరయ్య వర్గాల మధ్య మంగళవారం గొడవ చోటుచేసుకోవడంతో ఇరువురి ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు.

కత్తెరపురుగు వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 80బన్నూరు, పోతులపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.